సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ι 11 ι ఫిబ్రవరి ι 2025



ముగిసిన మిస్టర్ ఆంధ్రా..

మిస్టర్ ఆంధ్రా పోటీలు ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.

- 8లో



తాగిన మత్తులో..

తాగిన మత్తులో ఓ వ్యక్తి భార్యను హతమార్చాడు. జింకిభద్రలో ఘటన జరిగింది.

- 8లో

న్యూస్‌రీల్

ఆడిట్ అభ్యంతరాల పరిష్కారం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆడిట్ అభ్యంతరాలు పరిష్కారమైనట్లు రిజిస్ట్రార్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008–09 నుంచి 2022–23 ఏడాది వరకు ఉన్న అభ్యంతరాలు పరిష్కారమయ్యాయన్నారు. ఆడిట్ శాఖ అభ్యంతరాలకు పక్కాగా సమాచారం అందజేశామన్నారు. రాష్ట్ర ఆడిట్ ప్రాంతీయ ఉప సంచాలకులు సీతారామారావు ఆధ్వర్యంలోని బృందం అకౌంట్స్ పరిశీలించిందని చెప్పారు. రూ. 2.70 కోట్ల 146 ఫైళ్లకు ఎన్‌ఓసీ లభించిందని చెప్పారు.

మల్లికార్జున స్వామికి లావేరు తలపాగా



గ్రామంలో ఊరేగిస్తున్న మల్లికార్జున స్వామి తలపాగా

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దవీధికి చెందిన చేనేత కార్మికులు కాశిన వెంకటరమణ, కుటుంబసభ్యులు ఏటా మహాశివరాత్రికి శ్రీశైలం మల్లికార్జున స్వామికి తలపాగా తయారు చేసి సమర్పిస్తారు. గ్రామంలోని తలపాగా పనులు సోమవారం పూర్తికావడంతో సమీపంలోని శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ తోటయ్య దొర, రమణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు



ఇంద్రప్రస్థం నాటికలోని ఓ సన్నివేశం

కవిటి: మండలంలోని బొరివంకలో కళింగ సీమ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర నాటిక పరిషత్ పోటీలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. పోటీల్లో చివరి రోజైన సోమవారం గుంటూరు అభినయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' అనే నాటిక ఆద్యంతం అలరించింది. అనంతరం ఉత్తరాంధ్ర కళా స్రవంతి నాటిక ప్రేక్షకుల్ని ఆలోచింపజేసింది. చివరిగా స్థానిక శార్వాణీ గిరిజన సాంస్కృతిక సమాఖ్యవారి ప్రత్యేక ప్రదర్శనగా వేసిన కొత్త పరిమళం నాటిక ప్రశంసలు అందుకుంది.


పీడీఎస్ బియ్యం స్వాధీనం



కొజ్జిరియా జంక్షన్ వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

కవిటి: మండలం పరిధిలోని కొజ్జిరియా జంక్షన్ సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై జగన్నాథ దాబా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ప్రజాపంపిణీ బియ్యాన్ని ఆదివారం రాత్రి విజిలెన్స్, రెవెన్యూ అధికారుల సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల్ని కవిటి మండలం సీఎస్‌డీటీ కె.సంతోష్ కుమార్ సోమవారం వెల్లడించారు. విజిలెన్స్ ఎస్‌ఐ బి.రామారావు, సీఎస్‌డీటీ కె.సంతోష్‌కుమార్ తదితర సిబ్బంది వ్యూహాత్మకంగా జరిపిన ఈ దాడుల్లో కంచిలి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనంలో 70 బస్తాల్లో నింపిన 3380 కిలోల బియ్యం ఈ తనిఖీల్లో పట్టుకున్నామని సీఎస్‌డీటీ కె.సంతోష్ తెలిపారు. ఈ సోదాల్లో పట్టుబడిన బియ్యం విలువ రూ.1,53,780 కాగా బొలెరో వాహనం విలువ రూ.5లక్షలుగా తెలిపారు. ఈ తనిఖీల్లో కొజ్జిరియా వీఆర్‌ఓ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విహంగ సంగ్రహాలయం



పెలికాన్

రాజహంస ఎలా వేటాడుతుందో తెలుసా..? పాము బాతు గురించి ఎప్పుడైనా విన్నారా..? పోనీ నత్తగుల్ల కొంగ తెలుసా..? తేలినీలాపురం వెళితే అంతెత్తున కొంగలు ఎగురుకుంటూ కనిపిస్తాయి. చెట్లపై సేద తీరుతూ అగుపిస్తాయి. దూరం నుంచి చూస్తే అన్నీ ఒకేలా కనిపిస్తాయి. మరి వాటి గుర్తింపు తెలుసుకునేదెలా..? అందుకే అక్కడ ఓ మ్యూజియం ఏర్పాటు చేశారు. సైబీరియా నుంచి ఇక్కడకు వచ్చే అతిథి విహంగాల వివరాలన్నీ అందులో పొందుపరిచారు. ఒడ్డు పొడుగుతో సహా పక్షుల సమస్త సమాచారాన్ని కళ్ల ముందు ఉంచారు.



తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో పెలికాన్,పెయింటెడ్ స్టార్క్‌తో పాటు వ్యక్తి నమూనాలు

- పక్షులకూ ఓ మ్యూజియం
- పక్షుల జీవ వైవిధ్యం తెలిపే విధంగా ఆకృతులు
- పర్యాటకులను ఆకర్షిస్తున్న బర్డ్ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్

టెక్కలి:

ఏటా శీతాకాలం ఆరంభంలో కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో గల సైబీరియా ప్రాంతం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ వలస పక్షులు టెక్కలి మండలం తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రానికి చేరుకుని సంతానోత్పత్తి చేసుకుంటాయి. తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో గల చింత, రావి, తుమ్మ, గంగ్ర, జూము, వెదురు తదితర చెట్లపై ఆవాసాలు ఏర్పాటుచేసుకుని సమీపంలో చిత్తడి నేలల్లో వేట కొనసాగిస్తాయి. సుమారు 120 రకాల పక్షులు ఉన్నట్లు అధికారుల అంచనా. దూరం నుంచి పక్షులు చూడడం ఆనందించడం సహజం. పక్షులను దగ్గరగా చూస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఇక్కడ పక్షుల మ్యూజియం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ పక్షుల విన్యాసాలను తిలకించడానికి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. విదేశీ పక్షులైన పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల విన్యాసాలతో పాటు ఈ పక్షుల మ్యూజియం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

మ్యూజియంలో నమూనాలు..

విదేశీ పక్షుల ప్రత్యేకతలు ఎంతగానో ఆశ్చర్యానికి గురి చేస్తాయి. ఆయా ప్రత్యేకతలు మ్యూజియంలో నమూనాలు పరిశీలిస్తే..

పెలికాన్ : పెలికాన్ బాతు జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 8 కిలోలు ఉంటుంది. దీని ముక్కు పొడవు సుమారు 14 సెంటీ మీటర్లు. దీని రెక్కల పొడవు సుమారు 118 ఇంచీలు, రోజుకు 4 కిలోల చేపల్ని తింటుంది. ఒకే సారి 2 కిలోల బరువు కలిగిన చేపను సునాయాసంగా తినగలిగే సామర్థ్యం ఉంది. దీని గుడ్డు బరువు సుమారు 150 గ్రాములు. ప్రతి సీజన్‌కు 4 గుడ్లును మాత్రమే పెడుతుంది. దీని గుడ్డు 28 రోజుల్లో పిల్లగా పరిపక్వత చెందుతుంది. 3 నెలల్లో పిల్ల తల్లిగా మారుతుంది. దీని దవడ సంచి ఆకారంలో ఉంటుంది. రోజుకు 2 సార్లు ఆహారం కోసం బయటకు వెళ్తుంటాయి. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి. రోజుకు సుమారు 4 సార్లు బయటకు వెళ్తూ ఆహారాన్ని తీసుకువస్తాయి. పెలికాన్ దవడ సంచి ఆకారంలో ఉంటుంది. ఈ దవడలో సుమారు 4 కిలోల వరకు చేపల్ని నిల్వ చేయగలవు. పిల్లలకు ఆహారాన్ని నోటి ద్వారా అందజేస్తాయి. దీని జీవిత కాలం సుమారు 29 సంవత్సరాలు.



పక్షుల మ్యూజియంలో వివిధ రకాల పక్షుల ఆకృతి నమూనాలు

చూసొద్దాం రండి

120 రకాల పక్షుల్లో కొన్నింటి ప్రత్యేకతలు ఇలా..

పొడుగు ముక్కు ఉల్లంకి: ఈ పక్షి మట్టిలో ఆహార అన్వేషణకు బురద మట్టి ఇసుక నేలలో అనేక రకాలైన చిన్న పురుగులను కొక్కెం వంటి ముక్కుతో వేట కొనసాగిస్తుంది. ఈ పక్షి నమూనా మ్యూజియంలో ఏర్పాటు చేశారు.

తెడ్డు మూతి కొంగ: ఈ పక్షి మూతి చెంచా ఆకారంలో ఉంటుంది. నీటి అడుగున ఉన్న చిన్న జీవులను వేటాడుతుంది. అర్ధ చంద్రాకారంలో గల మూతితో వేట కొనసాగిస్తుంది.

పాము బాతు : బల్లెం వంటి ముక్కు ఆకారంతో ఈ పక్షి వేట కొనసాగిస్తుంది. మట్టి, నీటిలో పొడుచుకుంటూ ఆహారాన్ని సేకరిస్తుంది.

రాజహంస: జల్లెడ మాదిరిగా ఉన్న ముక్కు కలిగిన ఈ రాజహంస సూక్ష్మజీవులను సునాయాసంగా వేటాడుతుంది. ఈ పక్షి ముక్కులో ఒక రకమైన వడపోత పరికరం బిగించి ఉన్నట్లు ఉంటుంది.

నత్తగుల్ల కొంగ: నత్తలను వేటాడడంలో ఈ పక్షి ముక్కు ఎంతో పదునుగా ఉంటుంది. నత్తలను గట్టిగా పట్టుకోవడంతో ఆహారాన్ని సంపాదించుకుంటాయి.



తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో పక్షుల మ్యూజియంలో వివిధ రకాల పక్షుల ప్రత్యేకతల నమూనాలు



పెయింటెడ్ స్టార్క్

పెయింటెడ్ స్టార్క్ కొంగ జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 5 కిలోలు ఉంటుంది. దీని రెక్కల పొడవు 63 ఇంచీలు, ఇవి చిన్న చేపలు, పురుగులు, నత్తలు తింటాయి. కేవలం పావు కిలో వరకు మాత్రమే నోటిలో ఆహారాన్ని నిల్వ చేయగలుగుతాయి. తీసుకువచ్చిన ఆహారాన్ని గూడు మీద వేస్తే పిల్లలు తింటాయి. దీని నోటి పొడవు సుమారు 16 సెంటీ మీటర్లు. ఆహారం కోసం రోజుకు 2 సార్లు బయటకు వెళ్తుంటాయి. దీనికి సాధారణ దవడ మాత్రమే ఉంటుంది. దీని గుడ్డు సుమారు 75 గ్రాములు. ఇవి ఒక సీజన్‌లో 4 గుడ్లు మాత్రమే పెడతాయి. 28 రోజుల్లో గుడ్డును పిల్లగా పొదుగుతుంది. పిల్ల తల్లిగా మారాలంటే సుమారు 3 సంవత్సరాలు కాలం పడుతుంది. దీని జీవిత కాలం సుమారు 29 సంవత్సరాలు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి చివరి రోజు రెండు నామినేషన్ల దాఖలు
- మొత్తం 10 మంది నామినేషన్లు
- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ



మహారాణిపేట (విశాఖ) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. అభ్యర్థుల చేత రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా, సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల పర్వం ముగిసే సరికి 10 నామినేషన్లు దాఖలైనట్టు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉంటుంది. ఆ తరువాత పోటీలో ఎంతమంది ఉన్నారో స్పష్టమవుతుంది. అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ , నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు

కోసూరు రాధాకృష్ణ, పాకలపాటి రఘువర్మ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయ గౌరి, నూకల సూర్యప్రకాశ్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులు నాయుడు, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారు.

అఖిలభారత వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వర్సిటీ క్రీడాకారిణులు



అధికారులతో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణులు

ఎచ్చెర్ల క్యాంపస్: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల విశ్వవిద్యాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అఖిలభారత మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి జి.హర్షిత (శ్రీకాకుళం శారదా డిగ్రీ కళాశాల), డి.హేమశ్రీ (విద్యాధరి డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), ఎస్.ఝాన్సీ రాణి (శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాల) క్రీడాకారిణులు పాల్గొంటున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడా కారిణులు విజేతలుగా రావాలని వీసీ కె.ఆర్.రజిని అన్నారు. రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత, ఇతర అధికారులు అభినందించారు.

మొదలైన ప్రాక్టికల్ పరీక్షలు



జూనియర్ కాలేజీలో ప్రాక్టికల్స్‌లో నిమగ్నమైన విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 113 కేంద్రాలు కేటాయించగా తొలి విడతగా 61 కేంద్రాల్లో సోమవారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా పరీక్షలు కొనసాగాయి. ప్రాక్టికల్స్‌కు ఫిజిక్స్ పరీక్షకు 14,923 మంది, కెమిస్ట్రీ పరీక్షకు 14,922 మంది, జువాలజీ పరీక్షకు 4,808 మంది, బోటనీ పరీక్షకు 4,808 మంది, ఒకేషనల్ పరీక్షలకు 2,360 మంది హాజరవుతారు. డీఈవో కన్వీనర్/ఆర్‌ఐవో ప్రగద దుర్గారావు, డీఈవో కమిటీ సభ్యులు, తనిఖీ బృందాలు పరీక్ష కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు.

ఆల్బెండజోల్ పంపిణీ 93.49 %

అరసవల్లి: జిల్లాలో 93.49 శాతం మందికి సోమవారం సాయంత్రానికి ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. జిల్లాలో ఈ మేరకు లక్ష్యం 4,46,992 కాగా.. సోమవారం సాయంత్రానికి 4,17,936 మంది విద్యార్థులకు వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖాధికారుల సమక్షంలో డీవార్మింగ్ మాత్రలు వేయించడంతో జిల్లాలో డీవార్మింగ్ లక్ష్యం 93.49 శాతంగా నమోదైనట్లుగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బాలమురళీకృష్ణ ప్రకటించారు. జిల్లాలో కొత్తూరు మండలం మెట్టూరులో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పాఠశాల విద్యార్థులతో పాటు పాఠశాల, కళాశాలలకు దూరంగా ఉన్న విద్యార్థులకు కూడా ఈ డీవార్మింగ్ మాత్రలను వేయించేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించినట్లుగా డీఎంహెచ్ఓ బాలమురళీకృష్ణ తెలియజేశారు.

శాలిహుండం ఆదాయం రూ.15,22,003



శాలిహుండం గుడి ఆవరణలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

గార: భీష్మ ఏకాదశి పర్వదినాన శాలిహుండం కాళీయ మర్ధన వేణుగోపాల స్వామి తీర్థ యాత్ర సందర్భంగా హుండీలు, అభిషేకాలు టిక్కెట్లు ద్వారా 15 లక్షల 22వేల మూడు రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాదబాబులు తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో హుండీలు తెరిచి లెక్కించారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.3,12, 000, అభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.5,95,750లు, కేశఖండనల ద్వారా రూ.2,160లు, ప్రసాదాలు అమ్మకాల ద్వారా రూ.60వేలు, హుండీల ద్వారా రూ. 5,52,093లు వచ్చిందని తెలిపారు. గత ఏడాది కంటే అదనంగా రూ.2.13 లక్షల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

నిలిచిపోయిన సోడియం మాత్రల సరఫరా

- లబోదిబోమంటున్న కిడ్నీ బాధితులు

కాశీబుగ్గ:

ఉద్దాన కిడ్నీ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న అత్యవసరమైన మాత్రలు కొన్నింటిని సరఫరా చేయడం లేదు. దీంతో చేసేది లేక ప్రైవేటు మందుల షాపులపై ఆధారపడి ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రస్తుతం ఉద్దాన ప్రాంతంలో ఉన్న ఎనిమిది మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో ఉన్న వేలాది మంది కిడ్నీ బాధితులకు పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఉచితంగా మందులు అందించేవారు. ప్రస్తుతం వివిధ కారణాలతో కొన్నింటిని కుదిస్తున్నారు. ఇంజెక్షన్లు ఇతర మందుల విషయం బాధితులు చెప్పలేని పరిస్థితిలో ఉన్నా.. మాత్రలను మాత్రం గుర్తుపడుతూ తేడాను చెప్పగలుగుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వారి క్రియేటిన్ స్థాయి.. ఆరోగ్య సమస్యలను బట్టి పదిహేను రోజులకు అవసరమైన తొమ్మిది నుంచి ఇరవై ఒక్క రకాల మందులు అందిస్తుంటారు. వీటన్నింటిలో కిడ్నీని రక్షించేందు కు రోజుకు ఒక్కటి వేయాల్సిన సోడియం బైకార్బొ నేట్ 500 ఎంజీ మాత్రల సరఫరా నిలిపివేశారు. అవి లేకపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజకు వివరణ కోరగా ఆమె వివరణ ఇవ్వడానికి విముఖత చూపారు.



సరఫరా నిలిచిపోయిన సోడియం బై కార్బొనేట్ మాత్రలు

మాత్రలు ఇవ్వడం లేదు



మేము పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న వంశధార నిర్వాసితుల కాలనీలో జీవిస్తున్నాం. నాకు కిడ్నీ సమస్య ఉంది. వారానికి అవసరమైన సోడియం బై కార్బొనేట్ మాత్రలు అందించేవారు. ప్రస్తుతం రెండు వారాలుగా అడుగుతున్నా సరఫరా లేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి పలాస కిడ్నీ ఆస్పత్రికి పూర్తి స్థాయిలో మందులు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాము.

– పిట్ట నీలయ్య, ఆర్అండ్ఆర్ కాలనీ, కోసంగిపురం కూడలి

హైవే పనులపై హైటెన్షన్



రెవెన్యూ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు

రణస్థలం: రణస్థలం టౌన్‌లో జాతీయ రహదారిపై నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్ పనుల వల్ల స్థానిక వ్యాపారులు, భవన యజమానులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు డీజీఎం ఆనందరావు, పచ్చిగుళ్ల సాయిరాం, ఇ.తిరుపతిరాజు, పిన్నింటి సత్యంనాయుడుతో పాటు పలువురు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న ఫ్లై ఓవర్ పనులు నిలిపి వేసి స్థానికులకు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సూపరింటెండెంట్ డీవీఎస్ నారాయణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యతిరేక కమిటీ సభ్యులు మాట్లాడుతూ హైవే అధికారులు ఎలాంటి ప్రకటన లేకుండా జాతీయ రహదారికి ఇరువైపులా ఇష్టారాజ్యంగా మార్కింగ్ వేస్తూ పనులు చేస్తున్నారని, ఇప్పటికే ఈ పనులు నిరసిస్తూ ఒక రోజు రణస్థలం టౌన్‌లో బంద్ చేపట్టామని తెలిపారు. హైవే, రెవెన్యూ అధికారులు స్పష్టమైన వైఖరి తెలియజేయకపోతే రిలే నిరాహార దీక్షలు చేపడతామని చెప్పారు. దీనిపై సూపరింటెండెంట్ నారాయణ మూర్తి మాట్లాడుతూ హైవే అధికారులతో సమావేశం నిర్వహిస్తామని వివరించారు.

ఊరంతా కన్నీరు



అంతిమయాత్రలో యువంత్ చిత్రపటంతో తోటి విద్యార్థులు, గ్రామస్తులు

- పదేళ్ల యువంత్ మృతితో శోకసంద్రమైన కాపు గోదాయవలస
- అవయవదానం చేసిన బాలుడికి కన్నీటి నివాళి

టెక్కలి/శ్రీకాకుళం రూరల్/ సంతబొమ్మాళి: నిన్నమొన్నటి వరకు ఆడుతూ పాడుతూ ఇంటిలో తిరిగిన ఆ చిన్నారి ఇప్పుడు జ్ఞాపకమైపోయాడు. స్నేహితులతో కలిసి అల్లరి చేసిన బాలుడు గతమైపోయాడు. అమ్మా.. అమ్మా అంటూ వెనకే తిరిగిన బిడ్డ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. నాన్నా.. అంటూ ముద్దుగా పిలిచిన కొడుకు వారికి మరిలేడు. ప్రాణాంతక వ్యాధితో ఊపిరి వదిలేసిన ఆ చిన్నారి అవయవదానంతో చిరంజీవిగా మారిపోయాడు. మరణశయ్యపై ఉన్న ఆ బాలుడిని చూసి ఊరుఊరంతా రోదించింది. దారి పొడవునా జేజేలు పలుకుతూ అంతిమ వీడ్కోలు పలికింది. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసకు చెందిన వాతాడ యువంత్ (10) అవయవాలు దానం చేశారు.

జనవరి 29న బర్త్‌డే జరుపుకున్న యువంత్ ఆ తర్వాతి రోజు ఉదయం గొంతునొప్పితో పాటు వాంతులతో బాధ పడడంతో తల్లిదండ్రులు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. అయితే బాలుడు గులియాన్ బారో సిండ్రోమ్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు ధ్రువీకరించడంతో వారి గుండెల్లో రాయిపడింది. రెండు రోజుల క్రితం రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా సోమవారానికి బ్రెయిన్ డెడ్ కావడంతో తల్లిదండ్రులు చిరంజీవులు, రోజాలు అవయవదానానికి అంగీకరించారు. దీంతో కళ్ల ను రెడ్‌క్రాస్‌కు, రెండు కిడ్నీల్లో ఒకటి రాగోలు జెమ్స్, లివర్, మరో కిడ్నీని వైజాగ్‌లో కిమ్స్ ఐకాన్‌కు అందించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యాక మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. అక్కడ వేచి చూస్తున్న గ్రామస్తులంతా బాలుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. యువంత్ తోటి విద్యార్థుల రోదన ఆపడం ఎవరి తరం కాలేదు. ఊరంతా ర్యాలీ నిర్వహించి బాలుడికి అంతిమ వీడ్కోలు పలికారు.



అంతిమయాత్రలో రోదిస్తున్న తోటి విద్యార్థులు

క్లుప్తంగా

'స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'



మాట్లాడుతున్న సవర రాంబాబు

కాశీబుగ్గ: అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు గిరిజనులపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు వజ్రాయుధమైన 1–70 యాక్ట్ నిర్వీర్యం చేసేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చట్టాలను పటిష్టం చేయాలి గానీ కించపరిచేలా మాట్లాడం దారుణమన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం వారితో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందించాలన్నారు. టూరిజం ప్రాంతాల్లో గిరిజనులతో స్టాల్స్, హోటల్స్ పెట్టించే ఏర్పాటు చేయాలన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మన్యం జిల్లాలో మంగళవారం, బుధవారం చేపట్టే బంద్ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్ర రాజు, ఎం.జగ్గారావు, భాగ్యరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు



చిగురు మేఘం నాటిక దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా సోమవారం రెండు నాటిక ప్రదర్శనలు జరిగాయి. ముందుగా కేశిరెడ్డి రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. కళ సేవ ఎంతో గొప్పదన్నారు. గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏవూరి హరిబాబు దర్శకత్వంలో 'చిగురు మేఘం' నాటిక ప్రదర్శన చక్కగా సాగింది. అనంతరం విజయవాడ మైత్రీ కళా నిలయం ఆధ్వర్యంలో టి.వి.పురుషోత్తం దర్శకత్వంలో 'బ్రహ్మస్వరూపం' నాటిక ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ఎల్.రామలింగస్వామి, బీఏ మోహనరావు, నిక్కు అప్పన్న, జ్యోతి, రామచంద్రదేవ్, సత్యవతి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ఫేక్' ఉద్యోగాల ఫిర్యాదులపై విచారణ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖలో సంచలనమైన ఫేక్ ఉద్యోగాల నియామకపత్రాలతో పాటు ఉద్యోగమిప్పిస్తామంటూ తనను మోసం చేశారని బాధితురాలు ఎస్.ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై ఈనెల 12న డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ జరగనుంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖాధికారుల ఆదేశాల ప్రకారం విశాఖపట్నం డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావును విచారణాధికారిగా నియమించిన సంగతి తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో బాధితురాలి వాంగ్మూలాన్ని అలాగే ఫిర్యాదులో పేర్కొన్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ జీవీ నరసింహం, కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌తో పాటు అప్పట్లో డీఎంహెచ్‌వోగా పనిచేసిన బొడ్డేపల్లి మీనాక్షిల వాంగ్మూలాన్ని కూడా స్వీకరించాల్సి ఉంటుంది. అయితే విచారణ నోటీసులు మాత్రం ఈ వ్యవహారంతో సంబంధం లేనివారికి కూడా జారీ చేయడం గమనార్హం. దీంతో విచారణను నీరుగార్చేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ముగిసిన మిస్టర్ ఆంధ్రా పోటీలు

- చాంపియన్‌గా నిలిచిన శివాజీ
- రాష్ట్ర నలుమూలల నుంచి పాల్గొన్న బాడీ బిల్డర్లు
- కండల ప్రదర్శనతో ఆకట్టుకున్న యువకులు



60 కేజీల విభాగం విజేతలతో డాక్టర్ గొండు గంగాధర్, తిరుమలరావు, విజయ్ తదితరులు



మిస్టర్ ఆంధ్రా టైటిల్ అందుకుంటున్న శివాజీ

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని పీఎస్‌ఎన్‌ఎం హైస్కూల్ ప్రాంగణం వేదికగా శ్రీకాకుళం జిల్లా స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి వరకు జరిగిన 30వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీల్లో 55 కేజీలు, 60, 65, 70, 75, 80, 85, 85+ బరువు కేటగిరీల్లో క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 210 మంది హాజరవ్వగా, వీరిలో 150 మంది పోటీలకు అర్హత సాధించారు. వీరంతా తమ కండలను ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు.



తన శరీర సౌష్టవాన్ని చూపిస్తున్న శివాజీ

చిత్తూరు జిల్లాకు చెందిన వి.శివాజీ చాంపియన్‌గా నిలిచాడు. 8 వయో విభాగాల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచినవారికి రూ.1.25 లక్షల బహుమతులు అందజేశారు. ముఖ్య ప్రతినిధులు వి.విజయ్‌కుమార్, బలగ ప్రసాద్‌లు ట్రోఫీలు బహూకరించారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున యువత హాజరయ్యారు. సినీ నటుడు షేక్ శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

సిక్కోలు వేదికగా 11వ సారి...

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ గొండు గంగాధర్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. బాడీ బిల్డింగ్ చేయడం వలన అనారోగ్యాలు దరిచేరవని పేర్కొన్నారు. ఇప్పిలి తిరుమలరావు, బి.సూరిబాబు, సినీ నటుడు షేక్ శ్రీనివాస్(విశాఖ) తదితరులు మాట్లాడుతూ.. బాడీ బిల్డింగ్ క్రీడ ఎంతో ఖర్చుతో కూడుకున్నదని, శ్రీకాకుళంలో వరుసగా 10 సార్లు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి, 11వ సారి కూడా విజయవంతంగా నిర్వహించేలా అత్యద్భుతంగా ఏర్పాట్లు చేసిన విజయ్‌కుమార్, ప్రసాద్ బృందాన్ని అభినందించారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా, వారిని వ్యాయామం వైపు మళ్లించేలా విజయ్, అతని మిత్రబృందం చేస్తున్న కృషిని కొనియాడారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: విజయ్

ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బాడీ బిల్డర్స్ ఎక్కువ మంది పేద, మధ్య తరగతికి చెందిన వారేనని, ప్రభుత్వం చొరవతీసుకుని ప్రభుత్వ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం సీనియర్ బాక్సింగ్ కోచ్ మాణిక్యం ఉమామహేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ వి.విజయ్, అధ్యక్షుడు బలగ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ కె.గౌరీశంకర్(ఆమదాలవలస), ఎస్.శివకుమార్, పి.గోపాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. చీఫ్ రిఫరీగా కె.గురునాథరావు, రిఫరీలుగా టి.రాము, ఆర్‌వీఎల్ రత్నాకరరావు, ఎన్వీ నాగేశ్వరరావు, జి.విష్ణుమూర్తి, డి.కనకరాజు, బీపీ ఆర్ రెడ్డి, బి.మర్రిరెడ్డి, గుండేష్ రాము, అమ్ములు, జి.శ్రీను, కె.కిరణ్, కె.సోమినాయుడు వ్యవహరించి మెప్పించారు.



85 కేజీల విభాగంలో కండలు ప్రదర్శిస్తున్న బాడీ బిల్డర్లు

● సంధ్యా హారతి



చీకటి తెర ఊరంతా పరుచుకుంటున్న వేళ.. గువ్వలు గూటికి చేరుకుంటున్న సమయంలో.. పడమర దీపం పుడమి తల్లికి ఇలా హారతి పట్టింది. శ్రీకాకుళంలో కనిపించిన ఈ సంధ్యా హారతి చూపరులకు కనువిందుచేసింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం



సురేష్‌బాబు సింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నామని మహారాణా ప్రతాప్‌సింగ్ హైందవ సేవా సంఘ్ అధ్యక్షుడు పి.సురేష్‌బాబు సింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందూ ఆలయంలో పనిచేస్తున్న ప్రధాన అర్చకుడిపై జరిగిన దాడిని హిందూ ధర్మ పరిరక్షకులపై జరిగిన దాడిగా అభివర్ణించారు. హిందూ ఆలయాల పరిరక్షణ కోసం, సాంప్రదాయాలు, వారసత్వ హక్కుల కోసం అర్చకులు రంగరాజన్ విశేషమైన కృషి చేశారన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఎంతో నిబద్ధతతో తనవంతుగా నిర్విరామంగా ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రంగరాజన్‌పై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

లారీ ఢీకొని యువతి దుర్మరణం

- యువకుడికి తీవ్ర గాయాలు





సంఘటనా స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) కొణతాల ఉషారాణి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం (గాజువాక) : ఆటోనగర్‌లో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం చెందగా..యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళానికి చెందిన మళ్ల సిద్ధు, ఇచ్ఛాపురానికి చెందిన కొణతాల ఉషారాణి (22) లంకెలపాలెంలో ఫైజర్ ఫార్మా కంపెనీలో ఇంటర్నల్ షిప్ శిక్షణ పొందుతున్నారు. వీరిద్దరూ కూర్మన్నపాలెంలో నివాసముంటున్నారు. శుక్రవారం వీరిద్దరూ స్వస్థలాలకు వెళ్లే క్రమంలో ద్విచక్రవాహనాన్ని విశాఖ రైల్వే స్టేషన్‌లో పార్క్ చేశారు. ఇదిలావుండగా కొరియర్ వచ్చిందంటూ ఫోన్ రావడంతో సోమవారం స్వస్థలాల నుంచి వీరిద్దరూ విశాఖ చేరుకుని, ద్విచక్రవాహనంపై ఆటో నగర్ వెళ్లి పార్సిల్ రిసీవ్ చేసుకున్నారు. ఆటోనగర్ నుంచి కూర్మన్నపాలెం వస్తుండగా వెనుక నుంచి లారీ బలంగా వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న ఉషారాణి రోడ్డుపై పడిపోయింది. ఆమె పై నుంచి లారీ వెళ్లిపోవడంతో శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. వాహనం నడుపుతున్న సిద్ధు కాలికి గాయమైంది. క్షతగాత్రుడ్ని సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. యువతి మృతిపై ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. అయితే దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని, తల్లిదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

రేషన్ పంపిణీలో అక్రమాలు..?

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం వచ్చాక కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా స్థానిక డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి తొలగించారు. అతని స్థానంలో టీడీపీ కార్యకర్త ఎలాంటి నియామకం లేకుండానే రేషన్ కోసం డీడీలు కట్టి అనధికారికంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే బియ్యం పంపిణీలో కేజీ నుంచి రెండు కేజీల వరకు కోత విధిస్తూ లబ్ధిదారులకు అందజేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రేషన్‌ను ఎండీయూ ఆపరేటర్ పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ, స్థానిక టీడీపీ కార్యకర్తే దగ్గరుండి అక్రమాలకు పాల్పడుతూ పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై డిప్యూటీ తహసీల్దార్‌కు వివరణ కోరగా మంగళవారం విచారణ జరుపుతామని తెలియజేశారు.

రైతుల సమక్షంలో పరిష్కరించాలి

- భూ సమస్యలపై అలసత్వం వహిస్తే చర్యలు
- అధికారులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరిక



కొత్తూరు: విద్యార్థినికి నులి పురుగుల నివారణ మాత్ర వేస్తున్న దృశ్యం



బూర్జ: మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కొత్తూరు: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను రైతుల సమక్షంలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మండలంలోని గూనభద్రలో టెక్కలి డివిజన్ రెవెన్యూ అధికారులతో రెవెన్యూ సమస్యలపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న రైతుల భూముల వద్దకు వెళ్లి, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను కేటగిరీల వారీగా విభజించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఒక గ్రామం నుంచి వందకు పైగా దరఖాస్తులు వస్తే, 40 దరఖాస్తులు తహసీల్దార్ పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా ఆర్డీవోలు, జేసీలు పరిశీలించేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అనర్హుల పట్టాలు రద్దు చేయాలి

గతంలో పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు పరిశీలించి, అనర్హులకు పట్టాలు మంజూరు చేసినట్లయితే రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కర్లెమ్మ రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో తప్పులు నమోదైనందున, తమకు న్యాయం చేయాలని రైతులు గేదెల కృష్ణారావు, కరేన రామారావు తదితరులు వినతిపత్రం అందజేశారు. అలాగే కొత్తూరులోని కాలేజీ రోడ్డు నందు ఆర్అండ్‌బీ కల్వర్టును తెరిపించి మురుగు నీరు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. సమావేశంలో అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వంట గది నిర్వహణపై అసంతృప్తి

అనంతరం మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వంట గదిని కలెక్టర్ పరిశీలించారు. అయితే వంటగది నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత లేని కిరాణా సామాన్లు వినియోగిస్తుండడంతో వంట నిర్వాహకులు, హెచ్ఎంపై మండిపడ్డారు. వంట ఏజెన్సీ సభ్యులను తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం చిన్నారులకు నులి పురుగుల మాత్రలు వేశారు. ప్రతీ విద్యార్థి మాత్రలు వేసుకునేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.

అవగాహన అవసరం

బూర్జ: రెవెన్యూ సమస్యలపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష ఆధ్వర్యంలో శ్రీకాకుళం డివిజన్‌లోని 13 మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఆర్ఐలు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం డీఎస్‌వో జి.సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఇచ్ఛాపురం టౌన్: ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నింబంధనలకు వ్యతిరేకంగా ఇచ్ఛాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. నూతన నిబంధనల ప్రకారం ఆటోల రికార్డులు, లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చేయించుకోవాలంటే ఎచ్చెర్ల వాహన తనిఖీ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. దీనివలన ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. గత 25 ఏళ్లుగా కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాలకు చెందిన వాహనాలకు ఇచ్ఛాపురం కార్యాలయంలోనే తనిఖీలు జరిపి వివిధ రకాల సర్టిఫికెట్లు అందించేవారిని తెలియజేశారు. ప్రస్తుతం ఇచ్ఛాపురం నుంచి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎచ్చెర్లకు వెళ్లడం వ్యయ, ప్రయాసలతో కూడుకున్నదని పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక ఎంవీఐ ఆర్.గోవిందరాజుకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వి.దుర్యోధన, సెక్రటరీ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

- ఐదుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నూకమ్మ

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం రాజపురం గ్రామ సమీపంలో సోమవారం వేకువజామున ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మూలపేట గ్రామం నుంచి ఐదుగురు ప్రయాణికులతో నౌపడ వైపు వెళ్తున్న ఆటో, పొగమంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించకపోవడంతో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడినవారిని తక్షణమే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికుల్లో కప్పోలు నూకమ్మకు కాలు విరిగిపోగా, మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



జాతీయ రహదారిపై ఢీకొన్న లారీలు

రణస్థలం: మండలంలోని జేఆర్‌పురం జాతీయ రహదారిపై సోమవారం ఉదయం రెండు లారీలు బలంగా ఢీకొన్నాయి. జేఆర్‌పురం జాతీయ రహదారి పక్కన కూరగాయల మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు నిత్యం పదుల సంఖ్యలో లారీలు ఆగుతుంటాయి. ఈ క్రమంలోనే ఒక లారీ డ్రైవర్ కూరగాయలు కొనుగోలు చేసిన తర్వాత ముందుకు కదిలేందుకు కుడివైపు తిప్పుతుండగా, విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వస్తున్న లారీ ఢీకొంది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వాహనాలు బారులుతీరాయి.

నంబర్ గేమ్‌పై కేసు నమోదు

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి అమ్మవారి జాతరలో అనుమతి లేకుండా బెట్టింగ్ నంబర్ గేమ్ నిర్వహించడంపై జేఆర్‌పురం పోలీసులు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో జాతరలో అనుమతి లేకుండా నంబర్ గేమ్ ఆడిస్తున్న నిర్వాహకులు పి.రాంబాబు, రవితో పాటు మరొకరిపై జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి రూ.8,020 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీరు విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని వెల్లంపూడి గ్రామానికి చెందినవారు.

బిల్డింగ్ కమిటీ సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బిల్డింగ్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. భవనాల నిర్వహణ, మౌలిక సౌకర్యాల కల్పన, ఫర్నీచర్ ఏర్పాట్లు వంటి అంశాలు చర్చించారు. ప్రధానంగా తరగతి గదులు, వసతి గృహాల నిర్వహణపై మాట్లాడారు. సమావేశంలో వీసీ రజనీ, రిజిస్ట్రార్ సుజాత, బిల్డింగ్ కమిటీ సభ్యుడు పాగిరి సుగుణాకరరావు పాల్గొన్నారు.

బస్సులో తండేల్ పైరసీ సినిమా ప్రదర్శన

కాశీబుగ్గ: పలాస నుంచి విజయవాడ వెళ్లే బస్సులో ఇటీవల విడుదలైన తండేల్ సినిమా ప్రదర్శన వివాదంగా మారింది. పైరసీ కాపీ బస్సులో ప్రదర్శించడంపై సినిమా నిర్మాత బన్నీ వాసుకు పలాస ఆర్టీసీ మేనేజర్ సీతారామనాయుడు ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన నిర్మాత సంబంధిత బస్సు ఓనర్‌పై చర్యలు చేపట్టాలని కోరడంతో బస్సు లీజికిచ్చిన యజమానికి నోటీసులు అందించినట్లు మేనేజర్ తెలిపారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త



ఘటనా స్థలంలో రత్నాలు మృతదేహం



హత్యకు పాల్పడిన భర్త ఢిల్లేశ్వరరావు

కంచిలి, సోంపేట: మండలంలో జింకిభద్ర గ్రామంలోని బీసీ కాలనీలో సోమవారం రాత్రి మద్యం మత్తులో భార్యను భర్త హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జింకిభద్ర బీసీ కాలనీలో నివాసముంటున్న సాహుకారి ఢిల్లేశ్వరరావు రాత్రి 9 గంటల సమయంలో మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్య రత్నాలు(70)తో గొడవ పడ్డాడు. ఈ తరుణంలో విచక్షణ కోల్పోయి అందుబాటులో ఉన్న గొడ్డలితో ఆమెను నరికేశాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దంపతులు బెంకిలి గ్రామంలో టీ స్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తుండేవారు. ఇదిలా ఉండగా ఢిల్లేశ్వరరావుకు ఇద్దరు కుమారుల్లో ఒకరు మృతి చెందాడు. మరో కుమారుడు వారి మేడ మీద నివాసముంటున్నాడు. ఘటన జరిగిన తర్వాత మేడ మీద ఉన్న కుమారుడు దివాకర్ వద్దకు వెళ్లి, జరిగిన ఉదంతాన్ని ఢిల్లేశ్వరరావు చెప్పాడు. దీంతో కుమారుడి ఫిర్యాదు మేరకు సోంపేట ఎస్ఐ లవరాజు సంఘటన స్థలానికి వచ్చి కేసు నమోదు చేశారు.

నిందితుడు అరెస్టు

కాశీబుగ్గ/పలాస: పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన రౌడీ షీటర్ ఒడిశి భాస్కరరావును కాశీబుగ్గ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 27 ఏళ్ల దివ్యాంగురాలిపై అఘాయిత్యానికి ఒడిగట్టిన కేసులో అతడిని అరెస్టు చేశారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం.. పెదంచల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు గర్భం దాల్చింది. ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉండటంతో నాన్నమ్మ వద్దనే ఆమె ఉండేది. ఈ నేపథ్యంలో ఒడిశి భాస్కరరావు బాధితురాలిని లోబర్చుకుని గర్భవతిని చేశాడు. అనారోగ్యంగా ఉందని ఆస్పత్రికి తీసుకెళ్తే విషయం బయటపడింది. కాశీబుగ్గలో నివాసం ఉంటున్న భాస్కరరావు తరచూ తన స్వగ్రామం పెదంచల వచ్చిపోతుండేవాడు. తన ఇంటిని తుడవాలని పదే పదే పిలిచేవాడని, తాను గర్భవతిని కావడానికి ఆయనే కారణమని దివ్యాంగురాలు ఆరోపించింది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదరించాడని ఫిర్యాదులో పేర్కొంది. భాస్కరరావుపై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో మర్డర్ కేసు ఉండటంతో ఆయనపై రౌడీషీటర్ తెరిచి ఉంది. చీటింగ్‌కేసు సైతం నమోదై ఉంది. ప్రస్తుతం భాస్కరరావుపై కేసు నమోదు చేశామని సీఐ సూర్యనారాయణ తెలిపారు.